సాక్షి
మహబూబాబాద్

శనివారం | 30 | డిసెంబర్ | 2023



ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొన్న ఘటనలో 12 మంది కూలీలు గాయపడ్డారు. ఈ ఘటన వర్ధన్నపేట శివారులో జరిగింది.

- 10లో▸



సీటు కోసం సిగపట్లు

సీటు కోసం మహిళలు సిగపట్లు పట్టుకున్న సంఘటన వరంగల్–నర్సంపేట ఆర్టీసీ బస్సులో శుక్రవారం చోటు చేసుకుంది.

- 10లో▸

గరిష్టం/కనిష్టం
33.0⁰ /13.8⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

38,062 దరఖాస్తుల స్వీకరణ

మహబూబాబాద్: జిల్లావ్యాప్తంగా ప్రజాపాలన కార్యక్రమంలో రెండు రోజుల్లో 38,062 దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ శశాంక శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు రోజుల్లో 192 సభలు నిర్వహించామన్నారు. 51,565 కుటుంబాలకు 38,062 దరఖాస్తులు స్వీకరించామన్నారు.

గ్రామ సభల ఆకస్మిక తనిఖీ



గార్ల: మండలంలోని బీఆర్‌ఎస్‌తండా, మర్రిగూడెం పంచాయతీల్లో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలను జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామసభల్లో దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చిన లబ్ధిదారులతో అధికారులు మర్యాదగా మాట్లాడాలని సూచించారు. లబ్ధిదారులు ఎక్కువైతే కౌంటర్లు ఎక్కువగా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు భూక్య బుజ్జి, ప్రవళిక, రాంబాయి, కమిలి, జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, ఏపీడీ ఝాన్సీలక్ష్మి, స్పెషల్ ఆఫీసర్ బాలరాజు, తహసీల్దార్ స్వాతి బిందు, ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ రజిని, ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన గ్రామసభలో వాగ్వాదం



మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ పరిధి బేతోలు గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. గ్యారంటీల దరఖాస్తు ఫారంలో రేషన్‌కార్డు అంశం లేదని, కార్డు కోసం తెల్ల కాగితం మీద రాసి ఇవ్వాలని అనడం ఎంత వరకు సమంజసమని బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళన చేశారు. అందుకు పలువురు కాంగ్రెస్ నాయకులు స్పందిస్తూ రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, దాని కోసం కూడా ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలని బదులిచ్చారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. అధికారులు జోక్యం చేసుకుని వారికి నచ్చజెప్పి అక్కడి నుంచి పంపారు.

'దరఖాస్తులు' విక్రయిస్తే చర్యలు



మహబూబాబాద్: జిరాక్స్ సెంటర్లలో ప్రజాపాలన దరఖాస్తు ఫారాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మానుకోట మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ కమిషనర్, డీఈ ఉపేందర్ హెచ్చరించారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని అన్ని జిరాక్స్ సెంటర్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ.. అన్ని వార్డుల్లో కౌంటర్లు ఏర్పాటు చేసి ఉచితంగా దరఖాస్తు ఫారాలు ఇస్తున్నామన్నారు. ఇప్పటికే ప్రతీ ఇంటి దరఖాస్తులు అందాయన్నారు. జిరాక్స్‌ల విషయంలో అధిక ధరలు తీసుకుంటున్నారని ఎవరైనా ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

అనుమతి లేకుండా నడిపితే చర్యలు



సాక్షి స్పందన

గూడూరు: మండలంలో అనుమతి లేకుండా ఆధార్ కేంద్రాలను నడిపితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అశోక్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'ఆధార్ అప్‌గ్రేడ్ పేరుతో అక్రమ వసూళ్లు' అనే కథనానికి తహసీల్దార్ స్పందించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆధార్ కేంద్రాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాల దరఖాస్తులను జిరాక్స్ కేంద్రాల్లో విక్రయించొద్దన్నారు. అదేవిధంగా జిరాక్స్ ప్రతులకు అధిక డబ్బులు తీసుకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతీ ఒక్కరు గ్రామాల్లో జరిగే ప్రజాపాలన గ్రామసభల్లోనే అవసరమైన ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు పెట్టి దరఖాస్తు పూరించి అక్కడే ఇవ్వాలన్నారు.

మేడిగడ్డలో.. ఐదు గంటలు

ప్రాజెక్టు వద్ద బిజీబిజీగా గడిపిన మంత్రుల బృందం

- కుంగిన ప్రాంతం పరిశీలన.. అన్నారం బ్యారేజీ సందర్శన
- ప్రాజెక్టుపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన ఈఎన్‌సీ
- హాజరైన మంత్రులు ఉత్తమ్, శ్రీధర్ బాబు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్, ఎమ్మెల్యే వివేక్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీ వద్ద మంత్రుల బృందం ఐదు గంటలపాటు గడిపింది. ప్రాజెక్టు పరిస్థితి.. కుంగడానికి గల కారణాలు తదితర అంశాలపై ఈఎన్‌సీ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వగా మంత్రులు తమ సందేహాలను అడిగి తెలుసుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు జరుగుతున్న రచ్చపై ముందస్తుగా ప్రకటించిన ప్రకారం.. రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, రెవెన్యూశాఖ మంత్రి పి. శ్రీనివాస్‌రెడ్డి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ల బృందం శుక్రవారం మేడిగడ్డకు తరలివచ్చింది. మంత్రులు హైదరాబాద్ నుంచి నేరుగా ప్రత్యేక హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 12.14 గంటలకు మేడిగడ్డ బ్యారేజీకి చేరుకున్నారు. వారికి కలెక్టర్ భవేష్ మిశ్రా పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అక్కడినుంచి నేరుగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిమిత్తం ఎల్‌అండ్‌టీ క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు.

రెండున్నర గంటలపాటు 'ప్రజెంటేషన్'

ఎల్‌అండ్‌టీ క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెరపై ప్రొజెక్టర్ ద్వారా ఈఎన్‌సీ మురళీధర్‌రావు కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రాజెక్టు శంకుస్థాపన చేసిన సమయంనుంచి ఎత్తిపోతలు ఎత్తిపోయడం, టీఎంసీల వివరాలు, విద్యుత్ వినియోగం గురించి వివరించారు. అక్టోబర్ 21న భారీ శబ్దంతో 7వ బ్లాక్‌లో 20, 21, 22 పియర్‌లు కుంగిపోవడం వంటి ఘటనలు జరిగిన తీరును స్క్రీన్‌పై చూపించారు. అప్పులు, లాభనష్టాల గురించి తెలిపారు. నీటి వినియోగం, తరలింపులను పేర్కొన్నారు. మేడిగడ్డ బ్యారేజీలో మూడు పియర్‌లు, మూడు గేట్లు పనిచేయవని, పూర్తిగా పరిశోధన చేసిన తరువాత మిగితావి పనిచేస్తాయా లేదా అని తెలుస్తుందని తెలిపారు. మంత్రుల సందేహాలను ఈఎన్‌సీ నివృత్తి చేశారు. సుమారు రెండున్నర గంటలపాటు ఈ ప్రజెంటేషన్ కొనసాగింది. ప్రజెంటేషన్‌కు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు వచ్చారు.



బ్యారేజీలో నీటి మట్టాన్ని పరిశీలిస్తూ..



పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న ఈఎన్‌సీ

మేడిగడ్డ పరిశీలన

పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ముగిసిన తరువాత భోజన విరామం తీసుకున్నారు. అనంతరం మంత్రులు వాహనాల్లో మేడిగడ్డ బ్యారేజీ వద్దకు వెళ్లారు. కాలి నడకన కొంతదూరం వరకు వెళ్లారు. కుంగిన 21 పియర్ ప్రాంతాన్ని పరిశీలించారు. సుమారు అర్ధగంట పాటు పరిశీలించారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో మంత్రులు అన్నారం బ్యారేజీకి చేరుకున్నారు. అక్కడి హెలిపాడ్‌లో దిగిన తరువాత వాహనాల్లో బ్యారేజీ వద్దకు వెళ్లారు. 38వ పియర్ వద్ద సీపేజీ బుంగలు ఏర్పడ్డ ప్రాంతానికి ఇరిగేషన్ అధికారులతో కాలినడకన వెళ్లి చూశారు. 15నిమిషాల్లో తిరిగి వచ్చారు. తిరిగి సాయంత్రం 5.15గంటలకు హైదరాబాద్‌కు పయనమయ్యారు.

బ్యారేజీల వద్ద సందడి..

మంత్రులు, నాయకులు మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల వద్ద ఐదు గంటలపాటు బిజీబిజీగా గడిపారు. ఎల్‌అండ్‌టీ క్యాంపు ప్రాంతం మీడియా, ఇరిగేషన్ అధికారులు, కాంట్రాక్టర్‌లతో నిండిపోయి కనిపించింది. చాలా రోజుల తరువాత సందడి నెలకొంది. కాగా, మంత్రుల పర్యటన నేపథ్యంలో జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గోదావరి తీర ప్రాంతాల్లో కూంబింగ్ ఆపరేషన్స్ చేపట్టారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, జేఎస్ భూపాలపల్లి కలెక్టర్ భవేష్‌మిశ్రా, ఎస్పీ కిరణ్‌ఖరే, శశిభూషన్ కాచే, ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు, ఈఈ తిరుపతిరావు, నూనె శ్రీధర్, యాదగిరి ఉన్నారు.

మంత్రులు ఏమన్నారంటే..

ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన వాస్తవిక అంశాలను ప్రజల ముందు ఉంచాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించి ఆ దిశగా చర్యలు తీసుకుంటుందన్నారు. కాళేశ్వరాన్ని ప్రపంచ స్థాయిలో గొప్ప ప్రాజెక్టు అని అన్న అప్పటి సీఎం, మంత్రులు కుంగిన తర్వాత నోరు మెదపలేదన్నారు. ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రాజెక్టులో జరిగిన సాంకేతిక లోపాలు బయటపెడుతామని, బాధ్యులపైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ప్రాజెక్టుతో భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాలకు చుక్క నీరు రాదని తెలిపారు. మంథని, మంచిర్యాల జిల్లా చెన్నూరు రైతులను ముంపునుంచి ఆదుకోవాలని అన్నారు. ముంపు జరిగే ప్రాంతాల్లో కరకట్టల నిర్మాణం చేస్తే నష్ట నివారణ జరుగుతుందన్నారు. రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ తమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కట్టి ఉంటే తెలంగాణకు గ్రావిటీ ద్వారా సాగునీరు వచ్చి లాభం జరిగేదన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలతో తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు.



మాట్లాడుతున్న మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్

విజయవంతంగా నిర్వహిద్దాం



మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: ప్రజలు బీఆర్‌ఎస్‌కు అందించిన ప్రతిపక్ష బాధ్యతను విజయవంతంగా నిర్వహిద్దామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. డివిజన్ కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో శుక్రవారం పార్టీ ముఖ్య కార్యకర్తలతో దయాకర్‌రావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలు మూడు పర్యాయాలు తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించారని, వారి రుణం తీర్చుకోలేనిదన్నారు. గెలుపోటములు సహజమేనని, ప్రజా తీర్పును గౌరవిస్తామన్నారు. పార్టీ నుంచి వరంగల్ ఎంపీ టికెట్ తనకు ఇచ్చేందుకు సహకరించాలని దయాకర్‌రావును జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, నాయకులు సురేందర్‌రెడ్డి, రామిని శ్రీనివాస్, కుర్ర శ్రీనివాస్, ఎన్నమనేని శ్రీనివాసరావు, గుండాల నర్సయ్య, నాగరాజు, దొంగరి శంకర్, మాలోతు కాలునాయక్ పాల్గొన్నారు.

డిపో అభివృద్ధికి కృషి చేయాలి



నెహ్రూసెంటర్: ఆర్టీసీ డిపో అభివృద్ధికి ఉద్యోగులు, సిబ్బంది కృషి చేయాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీలత అన్నారు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో, ఆర్టీసీ పెట్రోల్‌బంక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డిపోకు మహాలక్ష్మి పథకం వల్ల అత్యధిక ఆదాయం రావడం ఆనందదాయకమని, డిపోకు అదనపు బస్సులు ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎంలు బానుప్రకాశ్, మాధవరావు, డిపో మేనేజర్ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సత్యవతిని పరామర్శించిన హరీశ్‌రావు



నివాళులర్పిస్తున్న హరీశ్‌రావు, తదితరులు

కురవి: మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్‌ను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు పరామర్శించారు. ఇటీవల సత్యవతిరాథోడ్ సోదరుడు గుగులోత్ కిషన్‌నాయక్ మృతి చెందాడు. ఈమేరకు శుక్రవారం మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి) శివారు పెద్దతండా జీపీలో కిషన్ నాయక్ దశదిన కర్మకు హాజరై ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, ఎమ్మెల్యేలు డాక్టర్ జాటోత్ రాంచంద్రు నాయక్, తెల్లం వెంకటరావు, కోరం కనకయ్య, మాజీ మంత్రి దయాకర్‌రావు, మాజీ ఎంపీ సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యేలు డీఎస్ రెడ్యానాయక్, బానోత్ శంకర్‌నాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, హరిప్రియ, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి నూకల నరేష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, కురవి జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి, జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ బన్నాల గీతప్రవీణ్, బీఆర్‌ఎస్ నాయకులు జాన్సన్ నాయక్, బోడ శ్రీను, మన్యూలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు రుణపడి ఉంటా

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఉద్యోగులు

తొర్రూరు: అసెంబ్లీ ఎన్నికల్లో తనకు అండగా నిలిచిన ఉద్యోగ, ఉపాధ్యాయ లోకానికి రుణపడి ఉంటానని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిని తొర్రూరు ప్రాంత ఉపాధ్యాయులు, వాలీబాల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కష్ట కాలంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు వెన్నంటి నిలిచారని, న్యాయాన్ని గెలిపించారని అన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలను ప్రభుత్వ దృష్టికి వెళ్తానని, వారి అభీష్టం మేరకు ప్రజాపాలన అందిస్తామన్నారు. ఉద్యోగ ఫ్రెండ్లీ ప్రభుత్వానికి సహకారం, సలహాలు అందించాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో కలిసి రావాలన్నారు. కార్యక్రమంలో వాలీబాల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు గొడిశాల నగేష్, ప్రధాన కార్యదర్శి దేవులపల్లి శంకర్, ప్రతినిధులు తుమ్మల ఫణీంద్ర, కొండం జనార్దన్, రాయిపల్లి యాకయ్య, జోగి వెంకన్న, సూరం ఉపేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లారీ కిందపడి యువకుడి ఆత్మహత్య



అశోక్(ఫైల్)

మహబూబాబాద్ రూరల్: లారీ కిందపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మానుకోట పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. టౌన్ సీఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రం మండల కేంద్రంలోని చైతన్యనగర్ కాలనీకి చెందిన జిలుకర బాబు, శాంతమ్మ దంపతుల కుమారుడు అశోక్(37) లారీకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు నాలుగేళ్ల క్రితం వివాహం కాగా భార్యతో విడాకులు తీసుకుని ఆమెకు దూరంగా ఉంటున్నాడు. కాగా కడుపునొప్పిగా ఉందని.. మానుకోట ఆస్పత్రిలో చూపించుకుని, అలాగే పట్టణంలో ఉండే తన చెల్లెలు అమలను కూడా చూసి వస్తానని తండ్రి బాబు తో చెప్పి గురువారం ఇంటి నుంచి వచ్చాడు. ఆస్పత్రిలో చూపించుకుని చెల్లెలు ఇంటి నుంచి బయలుదేరి వెళ్తూ ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో లారీ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలానికి టౌన్ ఎస్సైలు రామారావు, శివ చేరుకుని పరిశీలించారు. సీసీ పుటేజీల ఆధారంగా అశోక్ ఆత్మహత్య చేసు కున్నట్లు పోలీసులు నిర్ధారించారు. మృతుడి తండ్రి జిలుకర బాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నారు. అనారోగ్యంతోనే అశోక్ ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు.

జనం బారులు..




ప్రజలు ఏజెన్సీ ఎదుట ఉదయం నుంచి రాత్రి వరకు బారులుదీరారు.

కురవి: మండల కేంద్రంలోని వందన గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్ద వంటగ్యాస్ కనెక్షన్ లబ్ధిదారులు శుక్రవారం ఈ–కేవైసీ చేసుకునేందుకు బారులుదీరారు. గ్యాస్ లబ్ధిదారులు ఈ–కేవైసీ కోసం వేలిముద్ర వేయాలని ప్రచారం జరగడంతో కురవి, సీరోలు మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన

కష్టాల సాగు..

- నిండా ముంచిన అకాల వర్షాలు, వడగండ్లు
- వానాకాలంలో తొలుత అనావృష్టి.. తర్వాత అతివృష్టి
- చివరి దశలో మిచాంగ్ ముప్పు
- రోగాలతో మిర్చి పంటల నష్టం
- ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం



సాక్షి, మహబూబాబాద్: జిల్లా రైతులకు ఈ ఏడాది కూడా నష్టాలే మిగిలాయి. అతివృష్టి, అనావృష్టి, అకాల వర్షాలు, కొత్త కొత్త రోగాలతో రైతులు సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయి. జనవరి నుంచి డిసెంబర్ వరకు ప్రతీ నెల ఏదో ఒక ఇబ్బంది తలెత్తింది. యాసంగి పంటలకు నీరు అందక ఎండిపోయాయి. అలాగే వానాకాలం సీజన్‌లో మొదటి మురిపించిన చిరుజల్లులు.. తర్వాత మొహం చాటేయడంతో నాటిన మొక్కలను కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అదేవిధంగా కల్తీ విత్తనాలు, ఎరువుల భయం వెంటాడింది. తర్వాత ఒక్కసారిగా కురిసిన అతివృష్టితో పంటలు కొట్టుకుపోయాయి. పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. అలాగే మిర్చి రైతులను నల్లతామర రోగం వెంటాడి నష్టాలపాలు చేసింది. ధాన్యం సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు రోడ్డెక్కి నిరసన తెలిపారు. తమ పంటకు నిప్పుపెట్టి ఆవేదన వెల్లగక్కారు. చివరి దశలో మిచాంగ్ తుపాన్‌తో రైతులు మరింత నష్టపోయారు.



అకాల వర్షాలతో దెబ్బతిన్న మొక్కజొన్న(ఫైల్)

యాసంగి పంటల పశువుల పాలు

భూగర్భ జలాలు అడుగంటడంతో పంటలు పశువుల పాలయ్యాయి. ఈ ఏడాదిలో యాసంగి వరినాట్లు వేసిన నెల రోజులకే సాగునీటి ఎద్దడి ఏర్పడింది. దీంతో జిల్లాలోని కొత్తగూడ, బయ్యారం, గార్ల, కేసముద్రం మండలాల్లోని వందలాది ఎకరాల భూముల్లో పంటలు ఎండిపోగా పశువులకు మేతగా మారాయి.

అకాల వర్షాలు..

జిల్లాలో ఈ ఏడాది మార్చిలో కురిసిన వడగండ్ల వానతో జిల్లావ్యాప్తంగా మొక్కజొన్న, వరి, మిర్చి పంటలతో పాటు మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. నష్టాన్ని పరిశీలించి రైతులకు భరోసా ఇచ్చేందుకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాలోని పెద్దవంగర మండలంలో పర్యటించి రైతలకు ధైర్యం చెప్పారు. పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు.

అనావృష్టి.. అతివృష్టి..

వానాకాలం సీజన్ ప్రారంభంలో కురిసిన తొలకరి జల్లులకు రైతులు విత్తనాలు నాటారు. తర్వాత వర్షాలు మొహం చాటేయడంతో మొలకలను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడ్డారు. ఆ తర్వాత కుంభవృష్టి వర్షాల కారణంగా సాగు చేసిన పలు రకాల పంటలు నీటిపాలయ్యాయి. పంట భూముల్లో ఇసుక మేటలు వేశాయి. రాళ్ల గుట్టలుగా మారడంత వాటిని తొలగించేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు.

మిర్చి పంటకు తెగుళ్లు..

గిరిజనులు చిన్న చిన్న కమతాల్లో లాభసాటి వ్యవసాయం కోసం మిర్చి పంటను సాగు చేస్తారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 50వేలకు పైగా ఎకరాల్లో మిర్చి పంట సాగుచేయగా.. తామర పురుగు వెంటాడింది. గండుపూత, బొబ్బరోగం రావడంతో గార్ల, బయ్యారం, కేసముద్రం, నర్సింహులపేట, కురవి మండలాల్లో రెండువేల ఎకరాలకు పైగా పంటను దున్నేశారు.

పోడు పట్టాల పంపిణీ

దశాబ్దాల తరబడి గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములకు అటవీ హక్కు పత్రాలను కల్పించేందుకు గత ప్రభుత్వం పూనుకుంది. దీనిలో భాగంగా జిల్లాలోని 24,181 మంది గిరిజన రైతు కుటుంబాలకు 67,730 ఎకరాల అటవీ భూములకు హక్కు పత్రాలు అందజేశారు.

ఉద్యాన డిగ్రీ కళాశాల మంజూరు..

గిరిజనులు, నిరుద్యోగులు ఎక్కువగా ఉన్న జిల్లాకు ఉద్యాన డిగ్రీ కళాశాల మంజూరు చేశారు. దీంతో ఈ ఏడాది 150 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించి బోధన చేస్తున్నారు. ఉద్యాన పరిశోధనా స్థానంలో ఈ కళాశాలను ఏర్పాటు చేయగా.. నూతన భవనాలు నిర్మించే పనిలో ఉన్నారు.

ధరల హెచ్చుతగ్గుదల..

ఈ ఏడాది మొదట్లో పత్తి క్వింటాకు రూ.15వేలకు పైగా పలికింది. మిర్చి రూ.25వేల వరకు ఖరీదు చేశారు. సన్నరకం ధాన్యం రూ. 3,500 వరకు కొనుగోలు చేశారు. అయితే ఈ ఆనందం రైతుల్లో కొద్దికాలమే మిగిలింది. భారీగా పత్తి, మిర్చి ధరలు పడిపోవడంతో రైతులకు నష్టాలు వచ్చాయి.

జిల్లా వ్యవసాయ అధికారిపై వేటు

జిల్లాలో పంటల వివరాలు, ప్రభుత్వం నుంచి అందించే ఆదేశాలు, ఉత్తర ప్రత్యుత్తరాల సేకరణలో నిర్లక్ష్యం చేశారనే ఆరోపణలతో జిల్లా వ్యవసాయ అధికారిగా పనిచేసిన ఛత్రునాయక్‌ను కలెక్టర్ వ్యవసాయశాఖ రాష్ట్ర కార్యాలయానికి అటాచ్ చేశారు. అయితే ఆయన స్థానంలో మరొక అధికారి ఇప్పటి వరకు రాకపోవడం గమనార్హం.

మనోధైర్యం కోల్పోవద్దు




మాట్లాడుతున్న నాగజ్యోతి

కొత్తగూడ: బీఆర్‌ఎస్ కార్యకర్తలు మనోధైర్యం కోల్పోవద్దని ములుగు జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజల తీర్పును గౌరవిస్తూ ప్రజా సమస్యలపై నిలదీస్తూ ప్రజల పక్షాన నిలుస్తామన్నారు. మొదటి ప్రయత్నంలోనే సుమారు 70వేల ఓట్లు సాధించానని, అందుకు బీఆర్‌ఎస్ కార్యకర్తలు చాలా కృషి చేశారన్నారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటానన్నారు. ఓడీసీఎంఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వేణు, నెహ్రూ,తిరుపతి, వీరన్న, రమేష్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్

మహబూబాబాద్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌ను ఆయన శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. యార్డులో తిరిగి రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా వ్యాపారులు, మార్కెట్ అధికారులు, సిబ్బంది కొనుగోళ్లు జరపాలన్నారు. సకాలంలో కాంటాలు పెట్టాలన్నారు. మానుకోట వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి చర్యలు తీసుకునే విధంగా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. ఐదు రూపాయలకే రైతులకు భోజనం ఏర్పాటు, మార్కెట్ నూతన భవన నిర్మాణం, మార్కెట్ కు స్థలం కేటాయింపు, సెక్యూరిటీ గార్డుల సమస్యల అంశాన్ని పరిశీలిస్తామన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు నేపథ్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకమండలి రద్దు అంశాన్ని కూడా సీఎం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎంఓ ప్రసాదరావు, ఏఎంసీ సెక్రటరీ శంషీర్, సూపర్‌వైజర్ రమేష్, కేసముద్రం ఏఎంసీ రాజేంద్రప్రసాద్, సిబ్బంది రాజేందర్ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న రాంచంద్రునాయక్

క్లుప్తంగా

బాలికపై లైంగిక వేధింపులు

● నేరస్తుడికి జైలు శిక్ష, జరిమానా

వరంగల్ లీగల్: ఒంటరిగా ఇంట్లో ఉన్న 4వ తరగతి చదువుతున్న 8 ఏళ్ల బాలికపై లైంగిక వేధింపుల గురి చేసిన నేరం రుజువు కావడంతో హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన నేరస్తుడు మేకల రమేష్‌కు మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.1,000ల జరిమానా విధిస్తూ హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జి బి. అపర్ణ దేవి శుక్రవారం తీర్పు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల కేంద్రం అంబేద్కర్‌నగర్‌కు చెందిన దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిలో 8 ఏళ్ల చిన్న కుమార్తె 4వ తరగతి హసన్‌పర్తి ప్రభుత్వ పాఠశాలలో చదువుతుండగా 2020 జనవరి 30న పాఠశాలకు సెలవు కావడంతో ఇంటి వద్దనే ఉంది. తల్లిదండ్రులు కూలి పని నిమిత్తం వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలిక వద్దకు సమీప బంధువైన మేకల రమేష్(40) వచ్చి అసభ్యకరంగా ప్రవర్తించినట్లు సాయంత్రం ఇంటి చేరిన తల్లిదండ్రులకు బాలిక తెలిపింది. మరుసటి రోజు బాలిక తల్లి ఫిర్యాదు మేరకు హసన్‌పర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చారు. విచారణలో సాక్ష్యాధారాలు పరిశీలించిన కోర్టు నేరం రుజువు కావడంతో నేరస్తుడు మేకల రమేష్‌కు 3 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.1,000ల జరిమానా, బాధితురాలికి రూ.50వేల పరిహారం చెల్లించాలని తీర్పు వెల్లడించారు. కేసును పోలీస్ అధికారులు టి. గోపి, ఎల్.పవన్‌కుమార్ పరిశోధించారు. లైజన్ ఆఫీసర్ ఎం.వెంకటస్వామి, భరోసా కేంద్రం న్యాయవాది నీరజ పర్యవేక్షణలో కానిస్టేబుళ్లు వి.రవీందర్, రవి సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టారు. ప్రాసిక్యూషన్ పక్షాన పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాజమల్లారెడ్డి కేసును వాదించారు.

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

● 12 మందికి గాయాలు, ఆస్పత్రికి తరలింపు



సంఘటన స్థలంలో క్షతగాత్రులు

వర్ధన్నపేట: మిరపకాయలు ఏరడానికి ఓ ఆటోలో ప్రయాణిస్తున్న వ్యవసాయ కూలీలను ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో 12 మంది కూలీలకు గాయాలైన సంఘటన శుక్రవారం మండలంలోని వర్ధన్నపేట శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఇల్లంద గ్రామానికి చెందిన 17 మంది వ్యవసాయ కూలీలు అంబేద్కర్ నగర్ వద్ద మిరప తోటలో మిరప కాయలు సేకరించడానికి కూలీలుగా ఆటో మాట్లాడుకుని ప్రయాణిస్తుండగా అంబేద్కర్‌నగర్ గ్రామానికి సమీపంలో మూలమలుపు వద్ద ఆటోను ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న మహిళా కూలీలు రోడ్డుపై పడి హాహాకారాలు చేశారు. అదే సమయంలో అంబేద్కర్‌నగర్‌కు ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తున్న ఎమ్మెల్యే నాగరాజు పోలీసుల సహాయంతో క్షతగాత్రులను 108లో వర్ధన్నపేట ఆస్పత్రికి తరలించారు. మౌనిక, రజిత, మంజులకు తీవ్ర గాయాలు కాగా వారిని ఎంజీఎంకు తరలించారు.



కొనసాగిన పరిశోధన పత్రాల సమర్పణ



చర్చా కార్యక్రమంలో పాల్గొన్న వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు



మాట్లాడుతున్న ఆచార్యుడు

రెండో రోజు చర్చల్లో ఉత్సాహంగా పాల్గొన్న చరిత్రకారులు

● కేయూలో ప్రతినిధుల సందడి
● నేడు ముగియనున్న ఐహెచ్‌సీ సెషన్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ (ఐహెచ్‌సీ) 82వ సెషన్‌లో భాగంగా రెండో రోజు క్యాంపస్ అడిటోరియం వద్ద పరిశోధన పత్రాల సమర్పన కొనసాగింది. శుక్రవారం అడిటోరియంలోని వివిధ కార్యాలయ గదుల్లో మూడు సమాంతర సెషన్‌లలో ప్రతినిధులు, పరిశోధకులు, చరిత్రకారులు తమ పరిశోధన పత్రాల సమర్పనతో పాటు చర్చల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. 1,053 పరిశోధన పత్రాలు రాగా పాల్గొన్న వారు తమ పత్రాలు సమర్పిస్తున్నారు. మొదటి సమాంతర సెషన్‌లో దళిత్ హిస్టరీ పానెల్‌లో ఆచార్య బి.రామచందర్‌రెడ్డి అధ్యక్షతన రూట్స్ ఆఫ్ ఇండియన్ సబల్టన్ లేబర్ ట్రాజెక్టరీస్ ఆఫ్ క్యాస్ట్ ఆక్యూపేషనల్ పాటెర్న్ అండ్ ది మార్జినలైజ్డ్ అనే అంశంపై ప్రత్యేక ప్యానల్ సెషన్ జరిగింది. ఇందులో మొత్తం 22 మంది పరిశోధకులు వివిధ సామాజిక వర్తమాన పూర్వపు అంశాలపై పత్రాలు సమర్పించారు. న్యూఢిల్లీ జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ చరిత్ర విభాగం సీనియర్ ఆచార్యులు చిన్నారావు, చిటీబాబు ప్యానలిస్టుగా వ్యవహరించారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ దళితులు, దళిత వర్కర్స్‌కు వేతనాలు, పని పరిస్థితులు ఇతర సామాజిక అంశాలపై జరుగుతున్న వివక్ష, వారి హక్కుల కోసం ఆయన చేసిన కృషిని వివరించారు.

రెండో సమాంతర సెషన్‌లో..

రెండో సమాంతర సెషన్‌లో అలీఘర్ హిస్టోరియన్ సొసైటీ ఆధ్వర్యంలో రిస్ట్రక్చరింగ్ ఇండియన్ ఎకనామిక్ థీయరీ అనే అంశంపై జరిగిన సెషన్‌లో 10కిపైగా పరిశోధన పత్రాలు సమర్పించారు. ఆచార్య ఇర్ఫాన్ హబీబ్, ఆచార్య పట్నాయక్ భారత ఉపఖండం పురాతన కాలం నాటి సమకాలీనం వరకు ఆర్థిక పునర్ నిర్మాణ సిద్ధాంతంలో వచ్చిన మార్పులు, గతకాలంలో భారతదేశ ఆర్థిక వ్యవస్థలో వస్తున్న మార్పుల గురించి వివరించారు. ఆచార్య ప్రభాత్ పట్నాయక్, ప్రొఫెసర్ కెఎం శ్రీమాలి, ప్రొఫెసర్ రాజం గురుఖల్, ప్రొఫెసర్ కేశవన్ వెలుతాట్, ప్రొఫెసర్ ఇష్రాత్ ఆలం, ప్రొఫెసర్ సయ్యద్ అలీ నదీమ్ రిజావి పత్రాలు సమర్పించటంతో పాటు చర్చల్లో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు సుధాకర్

మూడో సమాంతర సెషన్‌లో..

కేయూలో ఆడిటోరియంలో నిర్వహించిన మూడో సమాంతర సెషన్‌లో డెక్కన్ పాస్ట్ అండ్ ప్రజెంట్ అనే అంశంపై మొదటిసారిగా ప్రాంతాల వారీగా ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌లో అంశం తీసుకున్నారని నిర్వాహకులు తెలిపారు. డెక్కన్ ప్రాంత సంస్కృతి సంప్రదాయాల్లో వస్తున్న మార్పులపై 12 మంది పరిశోధకులు తమ పత్రాలు సమర్పించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆచార్యులు సంజయ్ సుబోద్, ఆచార్య సయ్యద్ అలీనదీం రిజావి డెక్కన్ ప్రాంత సూఫీ విధానాలు, ఐడియాలు, పురావస్తు రికార్డులు వాస్తు నిర్మాణ, సాంకేతికగా వచ్చిన మార్పులు వివరించారు.

మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఆరు సెషన్లు

కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఆరు సెషన్లలో పరిశోధన పత్రాల సమర్పణ కొనసాగింది. 1,063 పరిశోధన పత్రాలు రాగా అందులో యాన్సింట్, మిడ్యూవల్, మోడర్న్, అదర్ ద్యాన్ కంట్రీ, ఆర్కియాలజీ విభాగాల్లో ప్రతినిధులు పరిశోధన పత్రాలు సమర్పించారు. అలాగే కూనూరులో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డాక్టర్ కుందూరు సుధాకర్ కాకతీయుల కాలం నాటి సామాజిక ఆర్థిక సంస్కృతిక అంశాలు వివరిస్తూ పరిశోధన పత్రం సమర్పించారు. పలువురు అంధ ప్రతినిధులు కూడా వారి పరిశోధన పత్రాలు సమర్పించారు. ఐహెచ్‌సీ సెషన్‌కు పరిశోధన పత్రాలు సమర్పించేందుకు వస్తున్న వారికి పాండేచ్చేరికి సంబంధించిన వారు వరల్డ్ హిస్టరీ కాంగ్రెస్ లైఫ్ మెంబర్ షిప్ క్యాంపేయిన్ నిర్వహించారు. సభ్యత్వం తీసుకోవాలని పాండిచ్చేరి ప్రతినిధులు కోరుతున్నారు.



పరిశోధన పత్రాలు సమర్పించేందుకు వచ్చిన అంధ ప్రతినిధులు

నేడు ముగింపు సభ

కాకతీయ యూనివర్సిటీలో మూడు రోజులపాటు జరిగే ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ 82వ సెషన్ నేడు (శనివారం) ముగియనుంది. సాయంత్రం 4 గంటలకు జరిగే సభకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, వీసీ ఆచార్య తాటికొండ రమేష్, ఐహెచ్‌సీ జనరల్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఆదిత్య ముఖర్జీ, సెక్రటరీ సయ్యద్ అలీ నదీమ్ రిజావి పాల్గొననున్నట్లు లోకల్ సెక్రటరీ ఆచార్య టి.మనోహర్ తెలిపారు.

చరిత్ర సామాజిక చైతన్యానికి నాంది

● నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ మాజీ డైరెక్టర్ మృదులా ముఖర్జీ



విలేకరులతో మాట్లాడుతున్న మృదులాముఖర్జీ, పక్కన ఆదిత్య ముఖర్జీ

చరిత్ర అనేది సామాజిక చైతన్యానికి నాంది, వివిధ సామాజిక శాస్త్రాలను సంకుచిత, పక్షపాత ధోరణితో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని ఢిల్లీలోని నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ మాజీ డైరెక్టర్, జేఎన్‌యూ హిస్టరీ విభాగం రిటైర్డ్ ఆచార్యులు మృదులాముఖర్జీ అభిప్రాయపడ్డారు. శుక్రవారం కేయూలోని ఆడిటోరియం వద్ద విలేకరులతో మాట్లాడారు. గత చరిత్రను, సామాజిక శాస్త్రాలను చదివితేనే సమాజంలోని అనేక అంశాలు అర్థం చేసుకునే వీలుంటుందన్నారు. పాలకులు కూడా చరిత్రను చదివితే సామాజిక పరంగా మంచి పరిపాలన కొనసాగించగలుగుతారన్నారు. నేటి సమాజంలో విద్యార్థులు ఎక్కువగా జాబ్ ఓరియంటెడ్ కోర్సులతోపాటు ఇంజనీరింగ్, మెడిసిన్ కోర్సుల వైపు మొగ్గు చూపుతుండటం, తల్లిదండ్రులు కూడా ఆ దిశగా చదివించేందుకు ఉపక్రమిస్తున్నారని ఇది సరికాదన్నారు. ప్రతీ గ్రామంలో చరిత్ర ఉంటుందని, ఉమ్మడి వరంగల్‌లోని కడవెండి ప్రాంతాన్ని ఒకప్పుడు సందర్శించానని, ఇప్పటికీ ఆ గ్రామం గొప్పతనం చెబుతున్నారన్నారు. చరిత్ర అంటే ఇదేనన్నారు. ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ జనరల్ ప్రెసిడెంట్ ఆదిత్య ముఖర్జీ మాట్లాడుతూ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ (ఐహెచ్‌సీ) ఏ పార్టీకి సంబంధించినది కాదన్నారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు అణచివేతలపై ఆర్‌ఎస్ శర్మ పుస్తకం రాయగా దానిని నిషేధించారని ఇది సరికాదన్నారు. వాస్తవికత చరిత్రను ప్రజలకు తెలియజేయటంలో చరిత్రకారుల ముందుకెళ్తున్నారని, అందుకు ఐహెచ్‌సీ కృషి చేస్తుందన్నారు.

కి'లేడీలు'!

● చికెన్ సెంటర్‌లో రూ.50వేల నగదు చోరీ



చికెన్ సెంటర్‌లోని కౌంటర్

జనగామ: చికెన్ కొనుగోలు కోసం వచ్చిన ఇద్దరు లేడీ కిలాడీలు.. వర్కర్లను మాయ చేసి గల్లా పెట్టెలోని నగదును అపహరించుకుపోయిన ఘటన శుక్రవారం జిల్లా కేంద్రం సిద్దిపేట రోడ్డులో జరిగింది. షాపు యజమాని రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదురుగా ఉన్న వెంకటసాయి చికెన్ సెంటర్‌లో కోళ్ల ఖరీదుకు కోసం ఉంచిన రూ.45వేలతో పాటు వ్యాపారానికి సంబంధించి రూ.5 వేలు కలుపుకుని రూ.50వేలను కౌంటర్‌లో ఉంచి తాళం చేశారు. రమేష్ భోజనం చేసేందుకు ఇంటికి వెళ్లగా, వర్కర్లు వ్యాపారం చేస్తున్నారు. ఇద్దరు మహిళలు షాపుకు వచ్చి కోళ్ల కాళ్లు కావాలంటూ లోనికి వచ్చారు. వర్కర్లు తమపని చేసుకుంటుండగా లేడీ కిలాడీలు టెక్నిక్‌గా తాళం తీసి అందులోని రూ.50వేలు తీసుకుని ఉడాయించారు. విషయం గమనించిన వర్కర్లు ఇద్దరు మహిళల కోసం గాలించినా దొరక్క పోవడంతో ఓనర్‌కు సమాచారం అందించారు. చోరీ విషయమై పోలీసులను ఆశ్రయించగా, కంట్రోల్ రూం సీసీ ఫుటేజీలను పరిశీలించారు. అందులో ఇద్దరు మహిళలు డబ్బు చోరీ చేస్తున్న దృశ్యం రికార్డు అయినట్లు రమేష్ తెలిపారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

రైల్వే బ్లాక్‌తో పలు రైళ్ల సర్వీస్‌లు రద్దు



కాజీపేట రూరల్: కాజీపేట సబ్ డివిజన్ పరిధి హసన్‌పర్తి–ఉప్పల్ రైల్వే స్టేషన్‌ల మధ్య దక్షిణ మధ్య రైల్వే అధికారులు చేపట్టిన నాన్ ఇంటర్ లాకింగ్ బ్లాక్ పనులతో పలు రైళ్ల సర్వీస్‌లను రద్దు చేసినట్లు శుక్రవారం రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట–సిర్పూర్ టౌన్ (17003) వెళ్లే ప్యాసింజర్, బల్లార్షా–కాజీపేట (17004) వెళ్లే రామగిరి ప్యాసింజర్, కరీంనగర్–సిర్పూర్ టౌన్ (07765) వెళ్లే ప్యాసింజర్, సిర్పూర్ టౌన్–కరీంనగర్ (07766) వెళ్లే ప్యాసింజర్‌ను జనవరి 13వ తేదీ వరకు రద్దు చేశారు. అలాగే సికింద్రాబాద్–సిర్పూర్ కాగజ్‌నగర్ (12757) వెళ్లే కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, సిర్పూర్ కాగజ్‌నగర్ (12758) వెళ్లే కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌ను జనవరి 2వ తేదీ నుంచి 13వ తేదీ వరకు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ప్రభుత్వ మార్పుతో నిర్బంధం తొలగింది

● ట్రాన్స్ కో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి
● టీఎస్ ఈఈయూ–327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్


హన్మకొండ: రాష్ట్రంలో ప్రభుత్వ మార్పుతో నిర్బంధాలు తొలిగిపోయాయని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ ఈఈయూ)–327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ అన్నారు. శుక్రవారం హనుమకొండ వడ్డెపల్లి రోడ్డులోని యూనియన్ కార్యాలయంలో పల్లా రవీందర్ రెడ్డి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో వివిధ యూనియన్‌ల నుంచి విద్యుత్ ఉద్యోగులు, ప్రధానంగా జేఎల్‌ఎంలు టీఎస్ ఈఈయూ–327లో చేరారు. యూనియన్‌లో చేరిన వారికి టీఎస్ ఈఈయూ–327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ కండువా కప్పి ఆహ్వానించి, మాట్లాడారు. రక్షణకు అవసరమైన మెటీరియల్ అందించాలని, రెగ్యులర్ ఇంక్రిమెంట్లు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్‌ఈఈయూ–327 టీఎస్ ఎన్పీ డీసీఎల్ శాఖ అధ్యక్షుడు పి.మహేందర్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు తులసి శ్రీమతి, నీలం ఐలేష్, మచ్చిక బుచ్చయ్య గౌడ్, డీ.సదయ్య, ఓదేలు, నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.



టీఎస్ ఈఈయూ–327లో చేరినవారితో ఇనుగాల శ్రీధర్



గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న ఆర్‌సీఓ విద్యారాణి

నయీంనగర్: ఉమ్మడి గురుకుల విద్యాలయాల్లో 2024–25 సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ ఆర్‌సీఓ విద్యారాణి తెలిపారు. శుక్రవారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్‌సీఓ మాట్లాడుతూ ఉమ్మడి ప్రవేశ పరీక్ష 2024 ఫిబ్రవరి 11న ఉదయం 11 గంటలకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్ణయించబడిన జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ విద్యాసంవత్సరం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో జనవరి 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీజీసెట్. జీఓవీ.ఇన్‌లో తెలుసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా సీఓలు సమ్మయ్య, ఉమామహేశ్వరి, భిక్షపతి, జె.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

● 14 మందిపై కేసు

వాజేడు: వాహన తనిఖీల్లో నిషేధిత గంజాయి దొరికినట్లు వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వాజేడు మండల పరిధిలోని జగన్నాథపురం జంక్షన్ వద్ద శుక్రవారం వాజేడు ఎస్సై వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలను నిర్వహించారు. ఆ సమయంలో వెంకటాపురం (కె) వైపు నుంచి కారు, నాలుగు ద్విచక్ర వాహనాలు వస్తుండటంతో పోలీసులు వాటిని ఆపి తనిఖీ చేశారు. కారు డిక్కీలో తనిఖీ చేయగా బ్రౌన్ కలర్‌లో ఉన్న ప్యాకెట్‌లో 3.720 కేజీల గంజాయి లభ్యమైంది. వెంటనే కారులో ఉన్న ఐదుగురితో పాటు రెండు ద్విచక్ర వాహనాలపై ఉన్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఐదురుగు పరారయ్యారు. అయితే డిసెంబర్ 31ను సెలబ్రేట్ చేసుకోవడానికి ఒడిసాలోని కలిమెలకు వెళ్లి గంజాయి కొనుక్కొని వస్తున్నట్లు బాధితులు తెలిపారు. పట్టుబడిన వారిలో తాడ్వాయి మండలం మేడారానికి చెందిన చిడెం సిద్ధార్థ, గండికోట అఖిల్, కొత్తూరుకు చెందిన గజ్జెల మధుకర్, కర్రెంగుల మధుకర్, పందెల్ల సాయి, కన్నెపల్లికి చెందిన పాయం సుధీర్, వాజేడు మండలం కొప్పుసూరు గ్రామానికి చెందిన వై.సాకేత్‌లతో పాటు మరో ఇద్దరు బాల నేరస్తులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తాడ్వాయి మండలం మేడారం గ్రామానికి చెందిన చెరుకూరు సందీప్, వాజేడు మండలం గుమ్మడి దొడ్డి గ్రామానికి చెందిన బోదెబోయిన వినయ్, ఇప్పగూడెం గ్రామానికి చెందిన కారం పవన్, అరుణాచల పురం గ్రామానికి చెందిన మడకం పృథ్వీ, మొరుమూరు కాలనీకి చెందిన మడకం పవన్‌లు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. నిందితుల నుంచి రూ.3 లక్షల విలువ చేసే కారు, రూ.50 వేల విలువ చేసే రెండు ద్విచక్ర వాహనాలు, రూ.93 వేల విలువ చేసే గంజాయి, ఆరు ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.



అరెస్ట్ చూపుతున్న సీఐ కుమార్, ఎస్సై వెంకటేశ్వర్‌రావు

చింత నెక్కొండలో..

పర్వతగిరి: మండలంలోని చింతనెక్కొండ గ్రామంలో మహారాష్ట్రకు చెందిన వ్యక్తి వద్ద రూ.3లక్షల విలువైన 12 కిలోల ఎండు గంజాయిని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పర్వతగిరి పోలీసులు సంయుక్తంగా స్వాధీనం చేసుకున్నారు. పర్వతగిరి సీఐ అనుముల శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం చింతనెక్కొండ గ్రామంలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పోలీసులు సంయుక్తంగా శుక్రవారం తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్ర వాషిం జిల్లా తరాల మంగ్రుల్పిర్ గ్రామానికి చెందిన శంకర్ అశోక్ పవార్‌ను గ్రామంలో అనుమానంగా కనిపించడంతో తనిఖీ చేయగా రూ.3లక్షల విలువ చేసే 12 కిలోల ఎండు గంజాయి లభ్యమైందన్నారు. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ తనిఖీలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పెండ్యాల దేవేందర్, పర్వతగిరి ఎస్సై వీరభద్రరావు, సిబ్బందిపాల్గొన్నారు.

తాత సంవత్సరీకానికి వచ్చి అనంతలోకాలకు..

● స్నానానికి వెళ్లి ఇద్దరు యువకుల మృతి



పవన్ (ఫైల్)



శ్రీకాంత్ (ఫైల్)

మొగుళ్లపల్లి: తాత సంవత్సరీకానికి వచ్చిన ఇద్దరు మనుమళ్లు వాగులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు మునిగి చనిపోయారు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం వేములపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల, పోలీసుల కథనం ప్రకారం.. వేములపల్లి గ్రామానికి చెందిన తాటిపాముల రాజీరు ఏడాది క్రితం చనిపోయాడు. శుక్రవారం సంవత్సరీకం (ఏడాది మాశికం). దీంతో అతని మనుమళ్లు తాటిపాముల పవన్(25), సిరిమల్లె శ్రీకాంత్ (17) (బావ బామ్మర్దులు)లు వేములపల్లికి వచ్చారు. గ్రామంలోని పెద్ద వాగులో స్నానానికి ఇద్దరు వెళ్లారు. వాగులో భారీ గుంతలు ఉండడం.. లోతు తెలియక దిగిన వారు ఈత రాకపోవడంతో మునిగిపోయారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు.. స్థానికుల సాయంతో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాలను బయటకు తీశారు. చిట్యాల సీఐ వేణు చందర్, ఎస్సై జాడి శ్రీధర్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. తాత సంవత్సరీకానికి వచ్చి ఇద్దరు మనుమళ్లు వాగులో పడి చనిపోవడంతో వారి తల్లిదండ్రుల రోదనలతో గ్రామంలో విషాదం అలుముకుంది. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

వీడని చిక్కుముడి..

● విజయ హత్య కేసులో లభించని ఆధారాలు
● నిందితుల కోసం శ్రమిస్తున్న పోలీసులు

కాజీపేట: కాజీపేట పట్టణంలోని రహమత్‌నగర్ కాలనీలో 15 రోజుల క్రితం అదృశ్యమై దారుణంగా హత్య గావించబడి రహదారిపై శవంగా పడి ఉన్న కన్నె విజయ కేసులో నానాటికి చిక్కుముడులు పెరుగుతున్నాయి. ఆదిలో కేసును సులభంగా పరిష్కరించవచ్చని భావించిన పోలీసులకు గతంలో వచ్చిన దృశ్యం సినిమాను గుర్తుకు తెస్తున్నట్లుగా ప్రచారం జరుగుతుంది. భర్త చనిపోవడంతో కుమారుడి వద్ద ఉంటూ చిన్న, చిన్న మొత్తాలను తెలిసిన వాళ్లకు ఇస్తూ ఉండే విజయకు అంతర్గత శత్రువులు అంటూ కాలనీలో ఎవరూ లేరంటున్నారు. మరి అలాంటప్పుడు విజయను హత్య చేసి శరీరానికి అయిన గాయాలతో పాటు రక్తపు మరకలను శుభ్రంగా సబ్బు నీళ్లతో కడిగి మళ్లీ ఇంటి సమీపంలోనే పడేసే ధైర్యం ఎవరు చేసి ఉంటారనే విషయం సందేహాలను రేకెత్తిస్తుంది. కాలనీ సమీపంలో ఉన్న సీసీ కెమెరాల్లో ఎక్కడ కూడా నిందితులు కనిపించకపోవడం, పోలీసులకు చిన్న క్లూ లభించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడంతో కేసును ఛేదించడం క్లిష్టంగా మారింది. ఏసీపీ డేవిడ్ రాజ్‌తో పాటు పోలీసు శాఖలోని పలు శాఖల సిబ్బంది నిందితులను పట్టుకోవడానికి హత్య వెలుగు చూసిన రోజు నుంచి మఫ్టీలోనూ ఆధారాల కోసం ప్రయత్నిస్తున్నారు. కాలనీ వాసులతో పాటు కుటుంబ సభ్యులు, ఇతర అనుమానితులపై నిఘాను పెంచిన పోలీసులు కడు జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. అందరినీ వరుసగా పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారించి పంపిస్తున్నారు. ఈ కేసును ఏ విధంగానైన ఛేదించి నిందితులను చట్టం ముందు నిలపాలని పోలీసులు నిరంతరంగా శ్రమిస్తున్నారు. వృద్ధురాలిని అకారణంగా పొట్టన బెట్టుకున్న నిందితులను పట్టుకోవడంలో విజయం సాధించాలని కాలనీవాసులు ఆకాంక్షిస్తున్నారు.



కన్నె విజయ (ఫైల్)

సీటు కోసం సిగపట్లు





ఆర్టీసీ బస్సులో కొట్టుకుంటున్న మహిళలు



● ఆర్టీసీ బస్సులో కొట్టుకున్న మహిళలు
● వరంగల్ నుంచి నర్సంపేట వెళ్తున్న బస్సులో ఘర్షణ

నర్సంపేట రూరల్ : ఆర్టీసీ బస్సులో సీటు కోసం మహిళలు సిగపట్లు పట్టుకున్నారు. ఈ ఘటన వరంగల్ జిల్లాలో శుక్రవారం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించిన విషయం తెలిసిందే. దీంతో మహిళలంతా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం చేస్తుండడంతో బస్సులన్నీ రద్దీగా ఉంటున్నాయి. వరంగల్ నుంచి నర్సంపేటకు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో మొదట ఓ మహిళ సీటు కోసం రుమాలు వేసింది. ఆమెకంటే ముందు ఎక్కిన మరో మహిళ ఆ సీటులో కూర్చుంది. బస్సు నర్సంపేట రూట్‌లో వెళ్తుండగానే ఆ తరువాత ఎక్కిన మొదటి మహిళ నా సీటులో ఎలా కూర్చుంటావంటూ ప్రశ్నించింది. ఇద్దరి మధ్య మాటామాట పెరిగి జుట్లు పట్టుకుని కొట్టుకున్నారు. ఆ తరువాత మరో మహిళ వచ్చి మా సీట్లో కూర్చున్నావంటూ అడిగింది. వీరిద్దరి మధ్య ఘర్షణ జరిగి కొట్టుకున్నారు. తోటి ప్రయాణికులు వారిని ఆపారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ జనగాంకి దగ్గరలో Farm Land చ॥గ॥ 2100/- DTCP చ॥గ॥ 3600/- లాంచింగ్ ఆఫర్‌తో గలవు. భూమి విలువ తెలిసినవారు త్వరపడి తక్కువ ధరకే Plot కొని ఆనందించగలరు. Ph: 7416591078 [H-801455]

SERVICES

■ శ్రీ బాలాజీ లోన్స్: మార్టిగేజ్ లోన్స్, పర్సనల్ లోన్స్, బిజినెస్ లోన్స్, IT రిటర్న్స్ (GST) చేయబడును. కాకతీయ టాకీస్, వరంగల్, ప్లాట్స్ కొనుగోలుపై ఇవ్వబడి. సంప్ర॥ 9573451926, 8522825358. [W-788977]

WANTED

■ Wanted Experienced Lab Technician, Pharmacist, PRO & Supervisor to work at Sri Sri Cardiac Center, Hanumakonda. Cont: 9966653521, 8639082085. [WA-7263]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మెసేజ్‌లు పంపిస్తూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 7702518530, 8019341329. [M-1167569]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్/ఫుల్ టైమ్‌గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926 [G-8407]

■ భువనగిరి ఏరియాలో సెక్యూరిటీ గార్డులు కావలెను. జీతం : 12,000/- రూం వసతి ఫ్రీ, 12 గంటల డ్యూటీ. సంప్ర॥ 6304719869. [Y-784280]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ. 18K సంప్ర: 9160900024 / 9640400073. [H-793669]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.